క్లుప్తంగా

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెక్టార్ ఎస్ఐ దేవసుధ బుధవారం తెల్లవారుజామున ఎర్రకట్ట, పాత రాజరాజేశ్వరి పేట ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా ఎస్ఐ దేవసుధ విచారించారు. పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్.ఖాజాగా గుర్తించి అతని వద్ద ఉన్న సంచిని పరిశీలించారు. అందులో 9 మద్యం బాటిల్స్, 9 బీర్ బాటిల్స్‌ను గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే పీడీ యాక్ట్ అమలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): నిబంధనలు అతిక్రమించి అసాంఘిక, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని డీసీపీ కృష్ణకాంత్ పటేల్ హెచ్చరించారు. సీపీ కాంతిరాణా టాటా ఆదేశాల మేరకు బుధవారం కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఆవరణంలో సౌత్ డివిజన్ పరిధిలోని కృష్ణలంక, గవర్నర్‌పేట, సూర్యారావుపేట పోలీస్ స్టేషన్లకు సంబంధించిన గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్, యాక్టివ్ రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ.. గంజాయి సేవించినా, అమ్మినా, సరఫరా చేసినా అటువంటి వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా నగర బహిష్కరణకు వెనుకాడబోమన్నారు. గంజాయి మత్తులో నేరాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. చిన్న పిల్లలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళ్ల ముందు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సౌత్ డివిజన్ ఏసీపీ రత్నరాజు, కృష్ణలంక, గవర్నర్‌పేట, సూర్యారావుపేట సీఐలు ఏ.మురళీకృష్ణ, దుర్గారావు, డి.వి.రమణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్యుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



డాక్టర్ దేవినేని ప్రదీప్, అధ్యక్షుడు



డాక్టర్ కేఎస్ భార్గవ్ ప్రధాన కార్యదర్శి

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారతీయ ఈఎన్‌టీ వైద్యుల సంఘం విజయవాడ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో బుధవారం జరిగిన సమావేశంలో 2024 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ దేవినేని ప్రదీప్, ఉపాధ్యక్షునిగా డాక్టర్ ఆర్.పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ భార్గవ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ తన్వీర్ అఫ్రోజ్, కోశాధికారి డాక్టర్ కె.వినీషాలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా వైద్యులు పి.సుధ, అనూష, గోపీనాయక్, కె.స్పందనలను నియమించారు.

దివ్యాంగులను ఆదరించటం సామాజిక బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులను ఆదరించటం సామాజిక బాధ్యత అని, కండరాల క్షీణతపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ వద్ద బుధవారం వరల్డ్ రేర్ డిసీజ్ డే సందర్భంగా అమరావతి రేర్ డిసీజ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మస్క్యులర్ డైస్ట్రోఫి వ్యాధిపై అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమ ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తుందన్నారు. అమరావతి రేర్ డిసీజ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుంకర శోభారాణి మాట్లాడుతూ.. మస్క్యులర్ డైస్ట్రోఫిలో రకాలు ఉన్నాయని, దీనిని గుర్తించి, ప్రజల్లో అవగాహన కలిగించడం కోసం ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. అనంతరం 10 మంది కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమరావతి రేర్ డిసీజ్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా పెద్దిరాజు బాధ్యతల స్వీకరణ

గన్నవరం: గన్నవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా వాసా పెద్దిరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ట్రాఫిక్ సీఐ సూర్యనారాయణరావును మచిలీపట్నం డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీసీఆర్‌బీ సీఐ వాసా పెద్దిరాజును ఉన్నతాధికారుల బదిలీ చేశారు. ట్రాఫిక్ స్టేషన్‌లో పెద్దిరాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పెనమలూరు పీఎస్, సీఐడీ, డీసీఆర్‌బీ విభాగాల్లో సీఐగా పనిచేశారు. అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా తిరస్కరణతోనే జనసేనకు అభ్యర్థులు కరువు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆసిఫ్
- 51వ డివిజన్ కొండ ప్రాంతాల్లో పర్యటన



51వ డివిజన్‌లో కరపత్రాన్ని అందజేస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజల నుంచి ఆదరణ లేకపోవటం వలనే జనసేన 24 సీట్లకు పరిమితమైందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో షేక్ ఆసిఫ్ మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఆంజనేయవాగు తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. కొండ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గురించి వివరించి అమలు తీరును తెలుసుకున్నారు.

బాబుకు సవాల్

కొండ ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కొండ ప్రాంతాల్లో మెట్ల నిర్మాణం, రిటైనింగ్ వాల్ నిర్మాణం, పాత పైప్‌లైన్ల తొలగింపు, కొత్త పైపుల ఏర్పాటు వంటి అంశాలను వివరించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ ప్రజల నుంచి తిరస్కరణ ఉండటంతో అభ్యర్థులు కరువై జనసేన అధినేత కేవలం 24 సీట్లకు మాత్రమే పోటీ చేస్తున్నట్లు ప్రకటించారని ఎద్దేవా చేశారు. 175 నియోజకవర్గాల్లో పోటీ చేయలేని జనసేన 151 సీట్లను సాధించిన జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించటం, గడ్డె దింపుతానంటూ ప్రగల్భాలు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ గత 2014 ఎన్నికల్లో ఇచ్చిన మ్యానిఫెస్టోను సైతం వెబ్‌సైట్ నుంచి తొలగించి ప్రజలను మోసం చేసిందన్నారు. నేడు ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. దమ్ముంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగిన విధంగా 'నేను మేలు చేస్తేనే నాకు ఓటు వేయండి' అన్నట్లుగా చంద్రబాబు ప్రజలను అడగాలని సవాల్ విసిరారు. టీడీపీ జనసేన కూటమికి కాలం చెల్లిందని అందువలనే ఇప్పటి వరకూ వారి అభ్యర్థులను సైతం ప్రకటించలేకపోయారని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో అభివృద్ధి జరిగిందన్నారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గం అభివృద్ధి పరుగులు తీసిందన్నారు. గత పాలకులు చేయలేని అనేక అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, పలువురు కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

దర్జీలకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న దర్జీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో దర్జీలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. పాతబస్తీలోని గాంధీజీ మినీ క్లాత్ మార్కెట్‌లోని దర్జీలు ప్రపంచ టైలర్స్ డేను పురస్కరించుకొని మార్కెట్ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆసిఫ్‌ను మార్కెట్‌లోని దర్జీలందరూ సత్కరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ దర్జీలకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో దర్జీలకు సైతం ఆయన మేలు చేస్తున్నారన్నారు. ప్రతి ఏటా 10 వేల రూపాయాల ఆర్థిక సాయమందిస్తున్నారని గుర్తు చేశారు. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధిని సాధించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ప్రతి ఇంటికీ కనీసం నాలుగైదు పథకాలు అందాయన్నారు. అంతేకాకుండా సమాజంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వెనుకబాటును తరిమికొట్టేందుకు సైతం తమ ప్రభుత్వం పాటుపడుతుందని చెప్పారు. మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు భావేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కే బాబు, కార్యదర్శి ఎస్‌కే ఇద్రీస్, కోశాధికారి పింకు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దేవాలయాలకు పునర్‌వైభవం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణు



కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హిందూ ధర్మ పరిరక్షణకు, వైదిక ధర్మాన్ని కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో రూ.70 లక్షల సీజీఎఫ్(కామన్ గుడ్ ఫండ్)తో నిర్మించిన నూతన భవనాన్ని స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి 90 ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఆలయ అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా విస్మరించారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పురాతన, శిథిలావస్థకు చేరుకున్న ఆలయాలకు సీజీఎఫ్ ఫండ్‌తో పునర్‌వైభవం తీసుకువస్తున్నామని తెలిపారు.

దాతలకు సన్మానం..

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.70 లక్షల నిధులు కేటాయించడం ఆలయ చరిత్రలో తొలిసారని విష్ణు చెప్పారు. అదే విధంగా రూ.95 లక్షలతో గవర్నర్‌పేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం, రూ.18 లక్షలతో తుమ్మలపల్లి కళాక్షేత్రం వెనుకనున్న శ్రీ వీరబాబుస్వామి ఆలయాన్ని ఆధునికీకరిస్తామన్నారు. దేవాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దైవబలం తోడైందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుతూ, దేవాలయాల వ్యవస్థను ఎల్లవేళలా పరిరక్షిస్తూ ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముక్కంటి దేవతల ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి నిధులు ఇచ్చిన దాతలను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.సుపద్మాదేవి, ఆలయ చైర్మన్ కొల్లూరు రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు, నాయకులు దోనేపూడి శ్రీనివాస్, కనపర్తి కొండా, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

భౌతికశాస్త్రంపై మరిన్ని పరిశోధనలు జరగాలి



మాట్లాడుతున్న సుబ్బరాయ శర్మ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు



ప్రదర్శనను వివరిస్తున్న శ్రీచైతన్య స్కూల్ విద్యార్థి



ప్రియదర్శిని హైస్కూల్‌లో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భౌతికశాస్త్రంలో మరిన్ని పరిశోధనలు జరిగితే సమాజానికి మరింత మేలు జరుగుతుందని విజ్ఞానభారతి జాతీయ కౌన్సిల్ సభ్యుడు, స్టేట్ కో ఆర్డినేటర్ కె.సుబ్బరాయ శాస్త్రి తెలిపారు. కేబీఎన్ కళాశాల భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ప్రాచీన భౌతిక శాస్త్రం సమగ్రాన్వేషణ' అంశంపై బుధవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన సుబ్బరాయశాస్త్రి మాట్లాడుతూ.. భౌతిక శాస్త్ర పరిశోధనల ఫలితంగానే నేడు అనేక ఆవిష్కరణలు మానవ వికాసానికి తోడ్పడుతున్నాయన్నారు. సీవీ రామన్ వంటి మహనీయులు ఆవిష్కరించిన అనేక అంశాలు నేటి ప్రపంచం ముందుకు సాగేందుకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఆ విధమైన పరిశోధనలను స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని ఆవిష్కరణలను తీసుకొచ్చేందుకు నేటి తరం కృషి చేయాలన్నారు. సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భౌతికశాస్త్ర పరిశోధకులుగా ఎదగాలన్నారు. సమాజానికి అవసరమైన పరిశోధనలను చేపట్టాలన్నారు. ఆ దిశగా అడుగులు వేయాలని పలు అంశాలను ఉదహరించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సైన్స్ విభాగాధిపతి ఆర్.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు సీహెచ్ నాగభూషణం, బి.శృతి, ఏహెచ్‌డీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో

వించిపేట(విజయవాడపశ్చిమ): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వించిపేటలోని శ్రీవిద్యాంజలి హైస్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రదర్శించిన పలు సైన్స్ ప్రాజెక్టులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేబీఎన్ కళాశాల సీనియర్ సైన్స్ అధ్యాపకులు జీబీఎస్‌కే ప్రసాద్, కె.ఉమామహేశ్వరరావులు పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకతో ప్రాజెక్టులు ప్రదర్శించడం హర్షనీయమన్నారు. అనంతరం సైన్స్ దినోత్సవం ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. ఇటీవల కేబీఎన్ కళాశాల యాజమాన్యం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన స్కాలర్‌షిప్ ప్రతిభా పరీక్షలో విజేతలు అల్మాస్ ఖాన్, ముష్ ఖాన్, షేక్ మోబీనాలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పుప్పాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో వెల్లివిరిసిన సృజనాత్మకత

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనల్లో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్ట్స్‌లో వారి సృజనాత్మకత వెల్లివిరిసింది. భవానీపురంలోని శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్ట్‌ల నమూనాలు భావి భారత శాస్త్రవేత్తలు, డాక్టర్లను తయారు చేసే విధంగా ఉన్నాయని కొనియాడారు. హెచ్ఎం సత్యచిత్ర మాట్లాడుతూ విద్యార్థులు 300కు పైగా నమూనాలను తయారు చేశారని చెప్పారు. నమూనాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ రామారావు, కో ఆర్డినేటర్ నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేత హైస్కూల్‌లో..

విజేత హైస్కూల్ జక్కంపూడి వైఎస్సార్ కాలనీ బ్రాంచి స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సైన్స్ ఎక్స్‌పోను స్కూల్ కరస్పాండెంట్, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి ప్రారంభించారు. సుమారు 50కి పైగా వివిధ ప్రాజెక్ట్‌ల నమూనాలను ప్రదర్శించారు.

శాస్త్రీయ విజ్ఞానంపై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానంపై పట్టు సాధించాలని శ్రీవాణి హైస్కూల్ కరస్పాండెంట్ మేకా కృష్ణశేఖర్ అన్నారు. పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'పై దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' అంటూ వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు చేసిన నినాదించారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలో గొల్లపూడి బైపాస్ రహదారి పక్కన బుధవారం సాయంత్రం నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆసిఫ్ వారికి దిశానిర్దేశం చేశారు. పోలింగ్ బూత్‌ను సిద్ధం చేయటం ఎలా, బూత్ అధ్యక్షుల విధులు, బాధ్యతల గురించి ఆయన వివరించారు. ప్రతి బూత్‌లోనూ వైఎస్సార్ సీపీకి కనీసం 60 శాతం ఓట్లు పడేలా చూడాలని సూచించారు. బూత్ అధ్యక్షులు బూత్‌ను మూడు భాగాలుగా విభజించి, బూత్ కోర్ కమిటీ సభ్యులను ఒక్కొక్క విభాగానికి మ్యాప్ చేయాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అఖండ మెజారిటీ తీసుకురావాలని, తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని పార్టీలు, జెండాలు జతకట్టినా సీఎం వైఎస్ జగనన్న జనం గుండెల్లో గూడుకట్టుకుని ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీసీఐ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, పడిగిపాటి చైతన్యరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, గుడివాడ నరేంద్ర రాఘవ, మండేపూడి చటర్జీ, మరుపిళ్ల రాజేష్, అర్షద్, బుల్లా విజయ్‌కుమార్, నాయకులు మైలవరపు దుర్గారావు, బంకా చాముండేశ్వరి, షేక్ హయాత్ షరీఫ్, అత్తలూరి పెదబాబు, మైలవరపు కృష్ణ, బట్టిపాటి శివ పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ పార్క్ పనులు త్వరగా పూర్తి చేయండి



పార్క్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పెంచే రిటైనింగ్ వాల్ పార్క్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు. ఆయన నగర పర్యటనలో భాగంగా కృష్ణానది ఫేజ్–2 రిటైనింగ్ వాల్ వెంబడి కనకదుర్గ వారధి నుంచి పోలీస్ కాలనీ డీపీ స్టేషన్ వరకు నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పార్కును బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పేపర్ బ్లాక్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో అవసరమైతే బ్యాచులను పెంచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాత్వేను పరిశీలించి మలుపులు అత్యంత సుందరంగా ఉండాలన్నారు. ప్రత్యేక మొక్కలను ఏర్పాటు చేసి గ్రీనరీ వర్క్ వెంటనే మొదలు పెట్టాలని ఆదేశించారు. ఏడీ ఎ.మహేష్, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, డెప్యూటీ ఇంజినీర్ పార్క్స్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న అసోసియేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నవ్యాంధ్ర విజయవాడ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 36వ టైలర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన ఈ వేడుకలకు అసోసియేషన్ సెక్రటరీ పిల్లి అనిల్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమంలో తొలుత అసోసియేషన్ ప్రతినిధులు కుట్టు మిషన్ ఆవిష్కర్త హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పిల్లి అనిల్ కుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా టైలర్స్ ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్తా) మాట్లాడుతూ హోవే ఆవిష్కరించిన కుట్టు మిషన్ నేడు ఎందరికో ఉపాధి కల్పిస్తోందన్నారు. సమాజానికి టైలర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిల్వెస్టర్ మిమిక్రీ ప్రదర్శన, లావణ్య బృందం భరత నాట్య ప్రదర్శన, కేవీ భాస్కర్ బృందం హాస్య వల్లరి సభికులను అలరింపజేసింది. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారు కొండేటి కృష్ణ, స్టీరింగ్ కమిటీ చైర్మన్ కూరపాటి రాఘవరాజు, ప్రెసిడెంట్ జె.డి. కళ్యాణ్, వైస్ ప్రెసిడెంట్ ఎండీ షఫీవుల్లా, జాయింట్ సెక్రటరీ షేక్ అస్లాం, కోశాధికారి జె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

ఉయ్యూరు: ఆరోగ్య సురక్ష శిబిరాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు అన్నారు. పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలోని 9వ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. డాక్టర్ గోపిచంద్, అప్తాల్మిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్, సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నేడు పోరంకిలో మినీ జాబ్‌మేళా

పెనమలూరు: పోరంకిలో మినీ జాబ్ మేళాను గురువారం నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటానికి ఉపాధ కల్పన శాఖ సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. పోరంకి శ్రీనివాసానగర్‌లోని హ్యాపీ మైండ్స్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం ఉదయం 9.30 గంటల నుంచి జాబ్‌మేళా ఉంటుందన్నారు. పలు ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజవుతారని అన్నారు. ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకున్న యువత జాబ్‌మేళాకు రావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 12 వేల నుంచి రూ. 20 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, ఆధార్, సర్టిఫికెట్లతో రావాలని, మరిన్ని వివరాలకు 96666 15539లో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై పలువురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన పెదపూడి మనోజ్‌కుమార్ కానూరులో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతను గ్రామంలో కొండ వెనుక ఉన్న నాయుడు టీ షాపు వద్దకు టీ తాగటానికి వెళ్లాడు. అక్కడ టీ కొట్టు యజమానితో ఇద్దరు వ్యక్తులు తగాదా పడుతుంటే వారిని మనోజ్‌కుమార్ నివారించాడు. కాగా ఇంట్లో సరుకులు తీసుకురావటానికి మనోజ్‌కుమార్ రాత్రి కిరాణా షాపు వద్దకు రాగా శివపార్వతినగర్‌కు చెందిన ఎం.మహేష్, జి.కిశోర్, జయ, సాయిరామ్, సిద్ధిక్ ఆటోలో వచ్చి అకారణంగా మనోజ్‌కుమార్ పై దాడి చేశారు. ఈ ఘటనలో మనోజ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. టీ షాపు వద్ద గొడవ నివారించినందుకే తనపై దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

పెనమలూరు: అపార్టుమెంట్‌లో పని చేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఈవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం రేపల్లె మండలం చౌడయ్యపాలెంకు చెందిన ఎస్.వెంకటేశ్వరరావు (60) కానూరులో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌లో పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 26వ తేదీన వెంకటేశ్వరరావు అపార్టుమెంట్ కింద ఉన్న సమయంలో పిల్లర్లకు ఉన్న రేకు బాక్సులు ఊడతీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ రేకు బాక్స్ పై నుంచి జారి కింద ఉన్న వెంకటేశ్వరరావుపై పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న అతను మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.